# పందికొక్కులు

(గల్పిక)

దేశంలో పందికొక్కుల విజృంభణ నానాటికీ తీవ్రమయింది. మనిషి చెమటోడ్చి పండించిన ధాన్యంలో పదోవంతు పందికొక్కుల కమిషనుగా ఆమోదించబడుతూ వస్తున్నది కాని యాభై శాతం పందికొక్కులు తినెయ్యటం చాలా తప్పు. అందుకని కొందరు యువకులు పందికొక్కులను వెతికి చంప సాగారు. పందికొక్కులను చంపటం హింస. వేద విరుద్ధం. అందుచేత ప్రభుత్వం పందికొక్కులను చంపే వాళ్లను వేటాడి తుపాకులతో కాల్చటమూ, పట్టుబడితే కారాగృహాలలో పెట్టి చిత్రహింసలు చేయటమూ సాగించింది.

అయినా "పందికొక్కులు నశించాలి" అన్న నినాదం ఇచ్చింది ప్రభుత్వం. "ఇది కపట నినాదం. ఈ ప్రభుత్వం పందికొక్కులను తుపాకులతో కాపాడుతున్నది," అంటూ కొందరు రాజకీయవేత్తలు బయలుదేరి, అహింసా విధానంలో పాత ప్రభుత్వాన్ని పడగొట్టి, కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేశారు.

వీళ్లు ప్రజలకు హామీ ఇచ్చారు! "పందికొక్కుల్ని అదుపులో ఉంచుదాం. దేశంలో ఆహారధాన్యాల కొరత తీరుస్తాం."

కాని పందికొక్కుల విజృంభణ తగ్గలేదు. హెచ్చింది. కొత్త ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రజలు అడిగారు

అలా అడగటం అన్యాయం. కొత్త ప్రభుత్వం చేతులు కట్టుకు కూర్చోలేదు. అది పందికొక్కులను అదుపులో ఉండమని వేడుకున్నది. న్యాయంగా పది శాతం భోంచెయ్యమన్నది. అంతకుమించి తినటం అక్రమమనీ, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయనీ అన్నది. ఆ చర్యలు ఎలాంటివో అది పరమ రహస్యం. పందికొక్కుల్ని అదుపులో పెట్టటానికి పదేళ్లు వ్యవధి ఇయ్యమనీ, పోయిన ప్రభుత్వం పెంచిన పందికొక్కుల్ని అదుపు చెయ్యటం త్వరలో జరిగే పని కాదనీ, అయినా పందికొక్కులను వేటాడేవాళ్ల ప్రాణాలు తీసే అహింసా కార్యక్రమం అక్షరాలా జరుగుతుందనీ కొత్త ప్రభుత్వం అటు ప్రజలకూ, ఇటు పందికొక్కులకూ కూడా హామీ ఇచ్చింది.

అందుచేత మళ్ళీ అయిదేళ్లకు ప్రజలు ఈ ప్రభుత్వాన్నే ఎన్నుకుంటే, పదేళ్ల తరవాత నందో రాజా భవిష్యతి.

***కొడవటిగంటి కుటుంబరావు***